AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

8-11-2025 (Saturday) MAIN EDITION

## మెరుగైన సేవలు అందించాలి




**అక్షరటుడే, హైదరాబాద్ :** పోలీసులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ సూచించారు. నగరంలోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన సెరిమోనియల్ పరేడ్‌లో ఆయన పాల్గొన్నారు. సీఏఆర్ సిబ్బంది పనితీరుతో పాటు క్షేత్రస్థాయిలో వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా నిర్వహించి.. మెరుగైన పోలీసింగ్ కోసం కృషి చేయాలని సూచించారు.

## వివేక్ రామస్వామి సమ్‌థింగ్ స్పెషల్: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్ రామస్వామి ఒహాయో గవర్నర్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. వచ్చే ఏడాది ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో వివేక్‌కు మద్దతుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా పోస్టు పెట్టారు. వివేక్ రామస్వామి సమ్‌థింగ్ స్పెషల్ అంటూ ప్రశంసలు కురిపించారు. 'ద గ్రేట్ ఆఫ్ ఒహాయో గవర్నర్ పదవికి వివేక్ రామస్వామి పోటీ చేస్తున్నారు. నాకు ఆ ప్రాంతం అంటే చాలా ఇష్టం. అధ్యక్ష ఎన్నికల్లో నాతోనే పోటీకి వచ్చాడు. అతడు స్పెషల్' అని ట్రంప్ పేర్కొన్నారు.

## కానిస్టేబుల్ ఆత్మహత్య



**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని ఉప్పల్‌లో ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లికార్జున నగర్‌లో నివసిస్తున్న శ్రీకాంత్ (42) ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన అక్టోబర్ 23 నుంచి విధులకు హాజరు కావడం లేదు. శనివారం తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

## రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి రూ.36,000 కోట్లు కేటాయిస్తామన్నారు. రూ.10,400 కోట్లతో హైదరాబాద్ - విజయవాడ హైవేను 8 లేన్లుగా విస్తరిస్తామని తెలిపారు.

## డిసెంబర్ 1 నుంచి పార్లమెంట్ సెషన్స్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుంచి నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. సమావేశాలను డిసెంబర్ 1 నుంచి 19 వరకు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ ప్రతిపాదనకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం తెలిపారని మంత్రి పేర్కొన్నారు.

## వందేభారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరో నాలుగు వందే భారత్ రైళ్లను ప్రారంభించారు. ప్రస్తుతం ఆయన ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా బనారస్‌ఖజురహో, లక్నోసహరన్‌పూర్, ఫిరోజ్‌పూర్‌ఢిల్లీ, ఎర్నాకులంబెంగళూరు మార్గాల్లో వందే భారత్ రైళ్లను శనివారం ఉదయం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల వందే భారత్ రైళ్లకు ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలిసిందే. వేగంగా వెళ్లడంతో ఆధునిక హంగులతో ఉన్న ఈ రైళ్లకు ఆదరణ పెరిగింది. దీంతో రైల్వే శాఖ వీటి సంఖ్యను పెంచుతోంది. ఇందులో భాగంగా శనివారం ఉత్తరప్రదేశ్‌లోని తన పార్లమెంటరీ నియోజకవర్గం వారణాసి నుంచి నాలుగు కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధాని ప్రారంభించారు.

## రాహుల్ గాంధీపై మోదీ సెటైర్లు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ సెటైర్లు వేశారు. రాహుల్ ఇటీవల బీహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. దీనిపై మోదీ స్పందిస్తూ.. ఎన్నికల్లో మునిగిపోయేందుకు ఇప్పటి నుంచే రాహుల్ ప్రాక్టీస్ చేస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. బీహార్‌లో చేపలను చూడటానికి పెద్దపెద్దవాళ్లు వస్తున్నారని పేర్కొన్నారు. కాగా బీహార్‌లో రెండో దశ ఎన్నికలు ఈ నెల 11న జరగనున్నాయి. ఆదివారంతో ప్రచారానికి తెరపడనుంది. దీంతో అధికార ఎన్డీఏ, విపక్ష మహాఘట్‌బంధన్ కూటములు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నాయి.



# పక్‌డో.. పక్‌డో..!

■ పొలాల్లో నాటుకోళ్లు ■ రహదారి పక్కన 2 వేల కోళ్లను వదిలి వెళ్లిన వైనం ■ ఎగబడి పట్టుకెళ్లిన స్థానికులు

**నాటు కోడి పేరు చెప్పగానే నోరూరుతుంది. మంచి మసాల దట్టించి కూర వండితే మాంసం ప్రియులు లొట్టలు వేసుకుంటారు. అయితే నాటు కోడి ధర అధికంగా ఉండటంతో చాలా మంది బాయిలర్ చికెన్ కొనుగోలు చేస్తారు. అయితే శనివారం ఆ ఊరంతా.. నాటు కోడి కూర వండుకున్నారు. పొలాల్లో నాటు కోళ్లు ప్రత్యక్షం కావడంతో పరిగెత్తుకు వెళ్లి పట్టుకొచ్చారు. దీంతో ఆ ఊరిలో ఏ ఇంట్లో చూసినా కోడి కూర దర్శనం ఇచ్చింది. ఈ ఘటన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తితో చోటు చేసుకుంది.**

**– అక్షరటుడే, వరంగల్**

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో విచిత్ర ఘటన చోటు చేసుకుంది. పొలాల్లో రెండు వేల వరకు నాటు కోళ్లు ఉండటంతో ప్రజలు ఎగబడి పట్టుకెళ్లారు. అయితే ఆ కోళ్లు ఎలా వచ్చాయనేది మాత్రం తెలియడం లేదు. నాటుకోళ్లకు ఉన్న డిమాండ్ తెలిసిందే. మార్కెట్‌లో వీటి రేటు ఎక్కువగా ఉంటుంది. అయితే సిద్దిపేటఎల్కతుర్తి రహదారిలో ఎల్కతుర్తి సమీపంలో రెండు వేల వరకు నాటు కోళ్లను గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో భారీగా అక్కడకు చేరుకున్నారు. పొలాల్లో కోళ్లను పట్టుకోవడానికి నానా తంటాలు పడ్డారు. కొంతమంది పదుల కొద్ది కోళ్లను పట్టుకొని ఇంటికి తీసుకువెళ్లారు. మరికొందరికి ఒకటి, రెండు కోళ్లు దొరికాయి.

### ఎవరు వదిలారో..

నాటుకోళ్లకు మార్కెట్‌లో మస్త్ డిమాండ్ ఉంటుంది. అయినా కానీ ఇన్ని కోళ్లను ఎవరు ఇక్కడ వదిలి వెళ్లారో తెలియడం లేదు. కోళ్లను ఎందుకు వదిలి పెట్టారోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. కోళ్లకు ఏదైనా వ్యాధి సోకడంతో వదిలేశారా.. లేక కోళ్లను తీసుకు వెళ్తున్న వాహనం ప్రమాదానికి గురైందా అన్న విషయాలు తెలియడం లేదు. ఏది ఏమైనా.. ఫ్రీగా కోళ్లు దొరికే సరికి ప్రజలు ఎగబడి తెచ్చుకున్నారు.

## కేసీఆర్‌ను కాపాడుతుంది కాంగ్రెస్సే : కిషన్ రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి బ్యాడ్ బ్రదర్స్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. కేటీఆర్, కిషన్‌రెడ్డి బ్యాడ్ బ్రదర్స్ అని సీఎం వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. కిషన్‌రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఎవరిని కాపాడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌ను కాపాడుతుంది రాహుల్ గాంధీ, కాంగ్రెస్ హైకమాండ్ కాదా అని ప్రశ్నించారు. హామీల అమలులో విఫలమైన సీఎం.. ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వీధిరౌడీలా సీఎం మాటలు: కవిత



**అక్షరటుడే, వరంగల్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీధి రౌడీలా మాట్లాడుతున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. జనంబాట కార్యక్రమంలో భాగంగా శనివారం వరంగల్, హన్మకొండలో పర్యటించారు. మొంథా తుపాన్ ప్రభావంతో ఇటీవల వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో.. వరద బాధితులతో మాట్లాడారు. పలు కుటుంబాలకు జాగృతి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. వరద బాధితులను ఆదుకోవాలని కవిత డిమాండ్ చేశారు. ఇటీవల ఇక్కడ పర్యటించిన సీఎం అనేక మాటలు చెప్పారన్నారు. అయితే ఇప్పటికీ ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. వరద బాధితులకు తక్షణ సాయం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

### బకాయిలు విడుదల చేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. రీయింబర్స్‌మెంట్ కోసం కాలేజీలు ఇటీవల బంద్ పాటించిన విషయం తెలిసిందే. దీనిపై సీఎం శుక్రవారం మాట్లాడుతూ కాలేజీల తీరుపై మండిపడ్డారు. సీఎం వ్యాఖ్యలపై కవిత స్పందించారు. వీధి రౌడీలు సిగ్గు పడేలా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడరన్నారు. కాలేజీ ఓనర్ల తాటా తీస్తా, తోలు తీస్తానని అనడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం బకాయిల విషయంలో మాట తప్పడంతోనే వారు కాలేజీలు బంద్ పెట్టారన్నారు.

## కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి: పొన్నం



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సమీపిస్తోంది. దీంతో గెలుపు కోసం ప్రధాన పార్టీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కాంగ్రెస్‌తోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో ప్రతి ఎన్నికలో ఓటింగ్ తక్కువగా నమోదవుతోంది. 50 శాతం ఓటర్లు మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో పొన్నం ఓ వీడియో విడుదల చేశారు. ప్రతి ఓటరు తమ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. ఈ నెల 11న పోలింగ్ సందర్భంగా నియోజకవర్గంలో సెలవు ఉంటుందని, ప్రజలు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను గెలిపిస్తే నియోజకవర్గ అభివృధి సాధ్యమన్నారు. గతంలో కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని, ప్రస్తుతం సైతం విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక యువకుడు, విద్యావంతుడైన తమ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు ఓటు వేయాలని ఆయన కోరారు.

## రాష్ట్రంలో పెరిగిన చలి



**అక్షరటుడే, హైదరాబాద్ :** రాష్ట్రంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మొన్నటి వరకు వానలు దంచికొట్టగా.. రెండు రోజుల నుంచి చలి తీవ్రత పెరిగింది. రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోయాయి. సాయంత్రం ఆరు కాగానే చలి ప్రారంభం అవుతోంది. ఉదయం 8 గంటల వరకు కూడా చలి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో ఎండ బాగానే ఉంటుంది. అయితే రాత్రి మాత్రం టెంపరేచర్ పడిపోతుంది. చలిపెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. 24 గంటల వ్యవధిలో ఆదిలాబాద్ జిల్లాలోని బేలాలో అత్యల్పంగా 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో 14.7, సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో 14.8, శంకర్‌పల్లిలో 14.9, మొయినాబాద్‌లో 15, ఆదిలాబాద్ జిల్లా భీంపూర్‌లో 15, సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 15.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. హైదరాబాద్ నగరంలోని రాజేంద్ర నగర్‌లో 15.3, బీహెచ్ఈఎల్ 15.5, మల్కాజ్‌గిరి 15.7, కుత్బుల్లాపూర్‌లో 15.7, గచ్చిబౌలిలో 15.9 డిగ్రీల టెంపరేచర్ రికార్డ్ అయింది.

## ఆపరేషన్ పింపుల్.. ఇద్దరు ఉగ్రవాదుల హతం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** జమ్మూ కశ్మీర్‌లో భద్రతా బలగాలు ఆపరేషన్ పింపుల్ చేపట్టాయి. పలువురు ఉగ్రవాదులు చొరబడ్డారనే సమాచారం మేరకు ఈ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. కుప్వారాలోని కేరాన్ సెక్టార్‌లో శనివారం భద్రతా దళాలు చొరబాటు ప్రయత్నాన్ని భగ్నం చేశాయి. ఉమ్మడి ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చాయి. విశ్వసనీయ సమాచారం మేరకు నవంబర్ 7న ఆపరేషన్ పింపుల్ ప్రారంభించినట్లు ఆర్మీ వర్గాలు తెలిపాయి. చొరబాటు ప్రయత్నానికి సంబంధించి ఏజెన్సీల నుంచి వచ్చిన నిర్దిష్ట నిఘా సమాచారం ఆధారంగా, కుప్వారాలోని కేరాన్ సెక్టార్‌లో ఉమ్మడి ఆపరేషన్ చేపట్టినట్లు పేర్కొన్నాయి. అయితే ఉగ్రవాదులు బలగాలపై కాల్పులు జరిపారు. అనంతరం సైన్యం ఎదురు కాల్పులు జరపడంతో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని ఆర్మీ అధికారులు తెలిపారు.

## మహారాష్ట్రలో భారీ భూ కుంభకోణం!

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మహారాష్ట్రలో మరో భారీ భూ కుంభకోణం చోటు చేసుకున్నట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ కుమారుడు పార్థ్ పవార్ భూ కుంభకోణం కేసు తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్ర మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ రూ.3 కోట్లకే రూ.200 కోట్ల విలువైన భూమిని దక్కించుకున్నట్లు కాంగ్రెస్ నాయకుడు విజయ్ వడెట్టివార్ ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ.. నాలుగు ఎకరాల భూమిని మంత్రి రూ.3 కోట్లకే కొనుగోలు చేశారన్నారు. కానీ సదరు భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్ల వరకు ఉంటుందన్నారు. ఆ భూమిలో మంత్రి విద్యాసంస్థను ఏర్పాటు చేశారని చెప్పారు. దీనిపై మహారాష్ట్ర రెవెన్యూమంత్రి చంద్రశేఖర్ బవాంకులే మాట్లాడుతూ.. దీనికి సంబంధించి ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నా పేరిట ఫేక్ ఫోన్ కాల్స్..

'కాంతార: చాప్టర్ 1' వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణి వసంత్. అయితే ఓ వ్యక్తి తన పేరును దుర్వినియోగం చేస్తున్నాడని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. 9445893273 అనే నంబర్ వాడుతున్న వ్యక్తి తాను రుక్మిణినని చెబుతూ తప్పుడు ఉద్దేశాలతో పలువురిని సంప్రదిస్తున్నాడు. "ఆ నంబర్‌కు నాకు ఎలాంటి సంబంధం లేదు. ఆ నంబర్ నుంచి వచ్చే కాల్స్ లేదా మెసేజ్‌లు పూర్తిగా నకిలీ. దయచేసి ఎవరూ వాటిని నమ్మవద్దు" అని ఆమె స్పష్టం చేశారు. అలాగే, ఈ ఘటనపై ఇప్పటికే చట్టపరమైన చర్యలు ప్రారంభించామని కూడా రుక్మిణి వెల్లడించారు. "ఇలాంటి మోసపూరిత చర్యలు సైబర్ క్రైమ్ పరిధిలోకి వస్తాయి. బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఏదైనా సమాచారం కోసం నేరుగా నన్ను లేదా నా టీమ్‌ను సంప్రదించండి. ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఉండండి" అని ఆమె పేర్కొన్నారు.

**– అక్షరటుడే, సినిమా డెస్క్**

